క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం...అల్లాడిన జనం



పాణ్యం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం 6.30 సమయంలో సబ్ స్టేషన్ మెయిన్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఎగ్గి ఫీజులు పోయాయి. దీంతో నంద్యాల నుంచి ఎంఆర్‌టీ టీమ్, ఇతర సాంకేతిక సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ సిబ్బంది శ్రమించారు. అనంతరం విద్యుత్ సరఫరా యథావిధిగా సరఫరా చేశారు. ఎనిమిది గంటలకుపైగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో జిల్లా జడ్జి



జడ్జికి తీర్థప్రసాదాలు అందిస్తున్న అధికారులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరులో గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని ఆదివారం కర్నూలు జిల్లా జడ్జి కబర్ది దర్శించుకున్నారు. జడ్జికి ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామివారి చరిత్ర గుర్తించి జడ్జి అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్చకులు శేషవస్త్రాలతో జడ్జిని సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణస్వామి, సురేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను వేధిస్తున్న హిమోఫీలియా



బాధిత చిన్నారులతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులను హిమోఫీలియా జబ్బు వేధిస్తోందని హెపటాలజిస్టు డాక్టర్ కాశీభారతి చెప్పారు. ఆదివారం పెంచికలపాడులోని విశ్వభారతి మెడికల్ కాలేజీలో హిమోఫీలియా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హిమోఫీలియా వ్యాధికి సంబంధించిన విషయాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన, వాడకూడని మందుల గురించి డాక్టర్ కాశీభారతి వివరించారు. మహిళాగ్రూపు సభ్యులు డాక్టర్ గాయత్రి ఆధ్వర్యంలో హిమోఫీలియా బాధితులు వారి సమస్యలు చెప్పుకున్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల నుంచి 120 మంది హిమోఫీలియా బాధితులు హాజరై వారి ఇబ్బందులను పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎఫ్ఐ ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యులు ప్రసాద్, కర్నూలు చాప్టర్ అధ్యక్షుడు పార్థసారధి, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

గూడూరులో చోరీ

కోడుమూరు రూరల్ : మండల కేంద్రం గూడూరులోని గొల్లవీధిలో నివాసముంటున్న లక్ష్మన్న ఇంటిలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. లక్ష్మన్న ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన దొంగలు ఇంటితోపాటు బీరువా తాళాలు పగులగొట్టి రెండున్నర తులాల బంగారం, రూ.52వేలను ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం చుట్టుపక్కల వాళ్లు విషయాన్ని లక్ష్మన్నకు ఫోన్ ద్వారా తెలిపారు. బాధితుడు లక్ష్మన్న గూడూరు చేరుకుని ఇంట్లో జరిగిన దొంగతనంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గూడూరు పోలీసులు లక్ష్మన్న ఇంటికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ మందిరంలో భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు నిర్వహించారు. భగవద్గీత పఠనం, హరే రామ హరే కృష్ణ సంకీర్తన జపం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠనం ఉత్తమ జీవన యానానికి ఉపకరిస్తుందన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అనంతరం జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు మహా రాజ భోగ నివేదన చేసి అన్న ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు , భక్తులు పాల్గొన్నారు.

- ఆర్టీసీ బస్సులకు నోచుకోని పల్లెలు
- ప్రమాదమని తెలిసినా తప్పని ఆటో ప్రయాణం
- విద్యార్థుల అగచాట్లు వర్ణనాతీతం

ఆటోలే దిక్కు..!



కోడుమూరు నుంచి పులకుర్తికి ఆటోలో వెళ్తున్న ప్రయాణికులు



కిక్కిరిసిన ప్రయాణికులతో వెళ్తున్న ఆటో

కోడుమూరు రూరల్ : ప్రమాదమని తెలిసినా ఆటో ప్రయాణం తప్పడం లేదు గ్రామీణులకు. చక్కటి రోడ్లున్నా ఆర్‌టీసీ అధికారులు కొన్ని గ్రామాలకు బస్సులను నడపడం లేదు. ముఖ్యంగా మండల కేంద్రాలు కోడుమూరు-సి.బెళగల్, గూడూరుల మధ్య కొన్నేళ్ల నుంచి ఆర్‌టీసీ అధికారులు బస్సు సర్వీసులను నడపడం లేదు. రోడ్డు బాగున్నా బస్సులను నడపకపోవడంతో ఆ మూడు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రాలకే బస్సులను నడపకపోతే ఇక మారుమూల గ్రామాల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో ఇట్టే అర్థమవుతోంది. ప్రత్యేకించి గూడూరులో సివిల్ సప్లై గోదాము, ట్రెజరీ కార్యాలయం ఉడడంతో ప్రతి రోజు కోడుమూరు నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, డీలర్లు నిత్యం వెళ్లి వస్తుంటారు. అలాగే గూడూరు నుంచి కూడా నిత్యం ప్రజలు, ఉద్యోగులతో పాటు, ఉన్నత చదువుల కోసం విద్యార్థినీ, విద్యార్థులు కోడుమూరుకు రావాల్సి ఉంటుంది. బస్సులు లేకపోవడంతో ఆయా ప్రజలు ప్రైవేట్ వాహనాలు, ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇక ఆటోల పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. తక్కువలో తక్కువ 10మంది లేనిదే ఆటో కదలని పరిస్థితి. కిక్కిరిసిన ఆటోలో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థులకు తప్పని ఇబ్బందులు...

గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు బస్సుల్లేక పోవడంతో విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో ప్రాథమికోన్నత, హైస్కూల్ వరకే పాఠశాలలు ఉండడంతో ఇంటర్, డిగ్రీ చదువుల కోసం విద్యార్థులు కోడుమూరు, సి.బెళగల్, గూడూరు వంటి మండల కేంద్రాలకు రావాల్సిన పరిస్థితి. అయితే బస్సులు లేకపోవడంతో ప్రతి రోజు విద్యార్థులు ఉన్నత చదువుల కోసం పట్టణ ప్రాంతాలకు వచ్చివెళ్లేందుకు ఆటోలను, ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రమాదమని తెలిసినా ఆటోలలోనే ప్రయాణించాల్సిన దుస్థితి దాపురించింది. చదువుల ఖర్చులతో పాటు, రవాణా చార్జీలతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి.

పల్లె వెలుగుకు నోచుకోని గ్రామాలు

- మండల కేంద్రం కోడుమూరు పులకుర్తి, బైన్‌దొడ్డి, మెరుగుదొడ్డి, కల్లపరి, క్రిష్ణాపురం, కొత్తపల్లె, ఎర్రదొడ్డి, అల్లినగరం, ముడుమలగుర్తి, అనుగొండ గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు.
- మండల కేంద్రం గూడూరు నుంచి చనుగొండ్ల, వై.ఖానాపురం, ఆర్.ఖానాపురం, పొన్నకల్లు, బూడిదపాడు గ్రామాలు ఆర్టీసీ బస్సులకు నోచుకలేదు.
- మండల కేంద్రం సి.బెళగల్ మండలంలోని చింతమాన్‌పల్లె, పల్కుదొడ్డి గ్రామాలకు అధికారులు బస్సు సర్వీసులను నడపక ఏళ్లు గడుస్తోంది.

బస్సులేక ఇబ్బందులు



మా గ్రామానికి రోడ్డున్నా గత రెండేళ్లుగా ఆర్టీసీ అధికారులు బస్సులు తిప్పడం లేదు. దీంతో ఏ అవసరమొచ్చిన ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. మా గ్రామం నుంచి ఉన్నత చదువుల కోసం ప్రతి రోజు 20 నుంచి 30మంది విద్యార్థులు కోడుమూరుకు వచ్చి వెళ్తుంటాం. బస్సు లేకపోవడంతో ఖర్చులు పెరిగిపోతున్నాయి. మా గ్రామానికి బస్సు నడపాలని కోరినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

– వీరేంద్ర, డిగ్రీ విద్యార్థి, కల్లపరి

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామానికి రోడ్డున్నా బస్సు తిరగక ఏళ్లవుతుంది. ఏ చిన్న అవసరమన్నా కోడుమూరు రావాల్సిందే. దీంతో రోజు ద్విచక్రవాహనం మీదే కోడుమూరుకొచ్చి వెళ్తుంటాం. ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఇక విద్యార్థుల ఇబ్బందుల చెప్పనలవి కావు. రాకపోకలకు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి ఇకనైనా ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పిస్తే బాగుంటుంది.

– జి.మధు, ముడుమలగుర్తి

మున్సిపల్ టీచర్లకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

కర్నూలు సిటీ: విద్యాశాఖలో మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించిన జీఓ 84ను సవరించి, వెంటనే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోకారి, టి.కె జనార్ధన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ భవనంలో ఏర్పాటు చేసిన ఎస్టీయూ కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. మున్సిపల్ టీచర్లకు సర్వీస్ రూల్స్ రూపొందించాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసి, వారి పదవి విరమణను 62 ఏళ్లకు పెంచాలన్నారు. కస్తూరిబాల్లో పని చేస్తున్న టీచర్లకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిషు, తెలుగు మాధ్యమాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు డి.సుధీకర్, ముదసిర్ అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, దేవదాసు, సురేష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి ప్రవాహం

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు జలాశయం నుంచి దిగువకు నీటి ప్రవాహం కొనసాగుతుంది. ఆదివారం నాటికి గోరుకల్లులో 10టిఎంసీల నిల్వ ఉండగా గాలేరు నగరి కాల్వకు 12వేల క్యూసెక్కులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఎస్సార్‌బీసీ బైపాస్‌కు 1,400 క్యూసెక్కులు విడుదల చేసినట్లు ఈఈ సుభకుమార్ తెలిపారు. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి గోరుకల్లు రిజర్వాయర్‌కు 12వేల క్యూసెక్కుల వరద వస్తున్నట్లు తెలిపారు.

అధికారుల పరిశీలించినా పొలానికి చేరని నీరు



కాల్వ సగానికే వదులుతున్న నీరు

పాణ్యం: ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ నుంచి బ్లాక్-4 కింద గోనవరం ఆలమూరు గ్రామాల చివరి ఆయకట్టు పొలాలకు సాగు నీరు అందడం లేదు. చివరి ఆయకట్టుకు నీరు అందని రైతుల విన్నపం మేరకు ఎస్సార్‌బీసీ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించినా ప్రయోజనం చేకూరలేదు. దీంతో గోనవరం, ఆలమూరు రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇరువై రోజులుగా సాగునీటి కోసం ఈ గ్రామాల ఆయకట్టు రైతులు ఇదురు చూస్తూనే ఉన్నారు. వేలకువేలు పెట్టుబడులు పెట్టి వరి సాగు చేస్తే తీరా సాగునీరు అందక కళ్లముందు పొలాలను ఎండబెట్టుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి విడుదల పెంచి కాల్వలో ఉన్న రాళ్లను తొలగిస్తే చివరి ఆయకట్టుకు నీరు అందుతుంది. అయితే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. బ్లాక్-4కాల్వ కింది 8,873 ఎకరాలు సాగవుతుంది. అయితే కాల్వలకు సమర్థ్యానికి కంటే తక్కువగా నీరు వదులుతుండడంతో సాగునీటి సమస్య ఎదురవుతుంది. అధికారులు స్పందించి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భీరలింగేశ్వర స్వామికి విరాళం



చెక్కు అందిస్తున్న దాతలు

కర్నూలు(అర్బన్): నగర శివారులోని పెద్దపాడు రోడ్డులో ఆదర్శ పాఠశాల పక్కన నిర్మిస్తున్న శ్రీ భీర లింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి దాతలు భారీగా విరాళాలు అందిస్తున్నారని కురవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి తెలిపారు. ఆదివారం అంబేడ్కర్ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ నిర్మాణానికి స్థానిక సంతోష్‌నగర్‌కు చెందిన దివంగత కురువ లింగారెడ్డి సతీమణి కురువ హనుమంతమ్మ, కుమారులు ఎంకే రాజశేఖర్, ఎంకే హరీష్, ఎంకే రఘునందన్ రూ.1,11,116 చెక్కు అందించారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ దేవాలయ నిర్మాణం, కమ్యూనిటీ హాల్, విద్యార్థుల హాస్టల్ నిర్మాణానికి పెద్ద సంఖ్యలో దాతలు ముందుకు వచ్చి ఆర్థికంగా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పాల సుంకన్న, గుడిసె శివన్న, బీసీ తిరుపాలు, దేవేంద్ర, కే రాజు, కె. వెంకటేశ్వర్లు, కె. మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

30న కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

కర్నూలు(సెంట్రల్) : కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు చేయాలని కోరుతూ 30వ తేదీన చేపట్టే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు అరకొర జీతాలు ఇస్తున్నారని, అవి కూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో కుటుంబాలు పస్తులు ఉంటున్నాయని చెప్పారు

పథకాలలో కోతలు విధిస్తాం

- ఎమ్మెల్యే గౌరు చరిత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు: గత ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలలో అనర్హులు ఉంటే కోతలు విధిస్తామని ఎమ్మెల్యే గౌరు చరిత హెచ్చరించారు. మండలంలోని కాల్వ గ్రామంలో ఆదివారం ×ఇది మంచి ప్రభుత్వం® కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, ప్రత్యేకాధికారి అమర్‌నాథ్ రెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ ఇండ్ల పట్టాల పంపిణీని పరిశీలించి, నిజమైన లబ్ధిదారులకు మాత్రమే పట్టాలు ఇస్తామని, బినామీదారుల పట్టాలను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ గతంలో ఉన్న పింఛన్లను పరిశీలించి నిజమైన లబ్ధిదారులకు మాత్రమే అందజేస్తామన్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు



ఏచూరికి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కోడుమూరు రూరల్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణ, గఫూర్‌మియ్యా పేర్కొన్నారు. ఆదివారం కోడుమూరు సీపీఎం కార్యాలయంలో మండల కార్యదర్శి గఫూర్‌మియ్యా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సీతారాం ఏచూరి సంస్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారం ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు, రైతాంగ సమస్యల పరిష్కారానికి ఏచూరి నిత్యం పాటు పడేవారన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి, సీపీఐ మండల కార్యదర్శి రాజు, యుటీఎఫ్ నాయకులు సలీంబాషా, స్థానిక నాయకులు వీరన్న, మధుబాబు, నాగేష్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

సి.బెళగల్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తెలిపారు. మండల కేంద్రం సి.బెళగల్లో ఆదివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. బస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్, సీబీ రాఘవరెడ్డి విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పాత బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రవేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తుంగభద్ర నది నుంచి సి.బెళగల్ చెరువుకు సాగునీరు మళ్లింపు చేపట్టాలని, అదేవిధంగా రోడ్ల మరమ్మతులు చేయించాలని మండల టీడీపీ కన్వీనర్ గోవిందు గౌడ్ ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల, తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్, స్థానిక పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి పిలునిచ్చారు. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మండల అధికారులందరు తప్పకుండా హాజరు అవ్వాలని, గైర్హాజరు అధికారులపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపడం జరుగుతుందని డీటీ తెలిపారు.

'శ్రీకాంత శతక' కావ్యావిష్కరణ

కర్నూలు కల్చరల్: తెలుగు కల్లం సాహితీ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ చిన్నావుల వెంకట రాజా రెడ్డి రచించిన 'శ్రీకాంత శతక' కావ్యావిష్కరణ కార్యక్రమం ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగింది. హైదరాబాద్ అవధాన భారతి చందో వైవిధ్య నిష్ణాతులు చక్రాల లక్ష్మీకాంత రాజారావు, రాయలసీమ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఆదవాని హనుమంతప్ప, బాలల కథా రచయిత డాక్టర్ హరికిషన్, డోన్ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు తొగట సురేష్‌బాబు అతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు నీతి శతకాల్లో అద్భుతమైనది శ్రీకాంత శతకం అన్నారు. సామాజిక స్పృహ, దేశభక్తి, భారతీయతను కవి చక్కగా వివరించారన్నారు. అనంతరం శతక కర్త డాక్టర్ చిన్నావుల వెంకట రాజా రెడ్డి దంపతులను అతిథులు సన్మానించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు అవధాని గంగుల నాగరాజు, నాగేశ్వర రావు, బెల్దోన కృష్ణమూర్తి, సమితి కార్యవర్గ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, ఫేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలి

కర్నూలు(అర్బన్): ప్రభుత్వం మద్యం దుకాణాలను ఎస్సీ, ఎస్టీలకు కూడా కేటాయించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప కోరారు. ఈ అంశంపై ఆదివారం ఇక్కడకు వచ్చిన జాతీయ షెడ్యూల్డు ట్రైబ్స్ కమిషన్ సభ్యులు జాటోతు హుసేన్ నాయక్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కల్లుగీత కార్మికులకు పది శాతం మద్యం దుకాణాలు కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. జీవనోపాధి, కుటుంబ పోషణ కోసం గిరిజన యువత నాటుసారా తయారీ, గంజాయి స్మగ్లింగ్ వంటి అడ్డదారులు తొక్కుతున్నారని, అదే మద్యం దుకాణాలు కేటాయించి ఉపాధి మార్గాన్ని చూపితే వాటి జోలికి పోకుండా గౌరవంగా జీవిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి. వెంకటేష్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏహెచ్‌ఏలకు మినహాయింపు ఇవ్వాలి

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక సహాయకుల(ఏహెచ్ఏ)కు ఇతర శాఖల పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏహెచ్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.రాజేష్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఏపీఎన్‌జీఓ హోమ్‌లో గాడ్యుయేట్ వెటర్నేరియన్స్ పెడరేషన్ జిల్లా చైర్మన్ జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా పశు సంవర్ధక సహాయకుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు అయింది. ఎన్నికల అధికారిగా గాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ జి.వెంకటేశ్వర్లు వ్యవహరించారు. అధ్యక్షురాలుగా పి.నాగవాసవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా సురేష్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంటుగా పి.వెంకటేష్, కోశాధికారిగా ఎం.భూపతి, ఉపాధ్యక్షులుగా జి.సురేష్‌బాబు, ఎన్.సుశీల, సంపత్‌నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.శరత్, సంయుక్త కార్యదర్శులుగా బి.శ్రావణి, శివ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయనాయక్, కోశాధికారి మంజునాథన్ పాల్గొన్నారు.

మండల రెవెన్యూ అధికారుల బదిలీలు

సి.బెళగల్: తహసీల్దార్‌తోపాటు మండల రెవెన్యూ అధికారులు భారీగా బదిలీ అయ్యారు. ఆగస్టు ఒకటవ తేది మండల తహసీల్దార్‌గా నియామకం అయిన తహసీల్దార్ విజయశ్రీ కేవలం 42 రోజుల లోనే కర్నూలు కలెక్టరేట్ ఏఓగా బదిలీ చేస్తూ జిల్లా రెవెన్యూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించిన సుధా డిప్యూటేషన్‌పై కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తుండగా ప్రస్తుతం కలెక్టరేట్‌లోని ఎస్‌డీసీ కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. అదేవిధంగా మండలంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆర్ఎస్ డీటీ కృష్ణమూర్తి కోడుమూరు ఆర్ఎస్ డీటీగా బదిలీ అయ్యారు. సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్ ఓర్వకల్ మండలానికి, ఆర్ఐ సౌమ్యా సుమిత రాజ్ కర్నూలు కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు. తహసీల్దార్ కార్యాలయ సబార్డినేటర్ శాలుమియ్య కోడుమూరు తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యాడు.

తొమ్మిది మంది వీఆర్వోలు బదిలీ

మండలంలోని వివిధ గ్రామాలలో వీర్వోలుగా పని చేస్తున్న 9 మంది బదిలీ అయ్యారు. మండలంలో మొత్తం 16 మంది వీఆర్వోలు ఉండగా, ఏడుగురిని కొనసాగించారు. బదిలీ అయిన 9 మందిలో నలుగురు సి.బెళగల్ మండలంలోని మరో గ్రామానికి బదిలీ అయ్యారు. మిగిలిన ఐదుగురు వీఆర్వోలలో ఎమ్మిగనూరు మండలానికి ఇద్దరిని, గూడూరు, కోడుమూరు, కర్నూలు అర్బన్ మండలాలకు ఒక్కొక్కరిని బదిలీ చేశారు.

తహసీల్దార్‌గా శ్రీనివాసరెడ్డి

మండల తహసీల్దార్‌గా శ్రీనివాసరెడ్డి మండల తహసీల్దార్‌గా నియామకం అయ్యారు. అలాగే రెగ్యులర్ డీటీగా కర్నూలులోని ఎస్‌డీసీ హెచ్ఎన్ఎస్ఎస్ మూడవ యూనిట్‌లో డీటీగా ఉన్న నాగరాజును సి.బెళగల్ మండల రెగ్యులర్ డీటీగా నియామకం అయ్యారు. మండల రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా దేవనకొండ రీ సర్వే డీటి వెంకటేశ్వర్లును నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సీనియర్ అసిస్టెంట్‌గా ఎస్‌డీసీ ఎల్ఏ హెచ్ఎన్ఎస్ఎస్ నాల్గవ యూనిట్‌లో సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వారమ్మ, తహసీల్దార్ కార్యాలయ సబార్డినేటర్‌గా కోడుమూరు తహసీల్దార్ కార్యాలయ సబార్డినేటర్‌గా గోవిందు నియామకం అయ్యారు. అయితే గోవిందును డిప్యూటేషన్‌పై కర్నూలు రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయానికి ఎంపిక చేశారు.

స్త్రీ, పురుషులిద్దరిలోనూ సంతాన సమస్యలు



ఐఎస్ఏఆర్ జాతీయ కార్యదర్శి డాక్టర్ ఆశాభక్షిని సన్మానిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో స్త్రీలలో ఒక్కటే సంతానలేమి సమస్యలు ఉంటాయన్నది అపోహ అని, ప్రస్తుతం స్త్రీతో పాటు పురుషునిలోనూ సంతానలేమి సమస్యలు అధికంగా ఉన్నాయని సీనియర్ వైద్యులు అభిప్రాయపడ్డారు. నగరంలోని మౌర్య ఇన్ హోటల్‌లో ఇండియన్ సొసైటీ ఆఫ్ అసిస్టెంట్ రీ ప్రొడక్షన్(ఐఎస్ఏఆర్) ఆధ్వర్యంలో రెండురోజులుగా కొనసాగుతున్న ఏపీ చాప్టర్ రాష్ట్రస్థాయి సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా పలు సైన్స్ సెషన్స్ నిర్వహించారు. ఇందులో గర్భాశయం, అండాశయంలో సమస్యలు, సంతానలేమి సమస్యలు ఎలా అధిగమించాలి, చికిత్స, పురుషుల్లో సంతానలేమి సమస్యలు, వాటిని ఎలా చికిత్స చేయాలి, పీసీఓఎస్ ఉన్న వారికి వచ్చే సమస్యలు, వాటిని ఎలా గుర్తించాలి, ఎలాంటి చికిత్సలు అందిస్తే వారు గర్భం దాలుస్తారనే విషయాలను చర్చించారు. సంతానలేమి సమస్యలకు పరిష్కారాలు కనుగొని చికిత్స అందించేందుకు ఇప్పుడు ఇన్‌ఫెర్టిలిటీ కేంద్రాలు అత్యాధునిక సేవలు అందిస్తున్నాయని చెప్పారు. కర్నూలు నగరంలోనూ ఇలాంటి కేంద్రాలు ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐఎస్ఏఆర్ జాతీయ కార్యదర్శి డాక్టర్ ఆశాభక్షి, స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ పద్మలత యారాసి, కార్యక్రమం ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ విష్ణుప్రియ, ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ జి. విజయలక్ష్మి, ఈసీ మెంబర్లు డాక్టర్ శిరీషారెడ్డి, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ భార్గవి, సీనియర్ గైనకాలజిస్టులు డాక్టర్ బీటీ సీత, డాక్టర్ సావిత్రి, డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



పార్కులు ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, సంచరిస్తున్న పందులు

అధ్వానంగా పార్కులు...

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని పార్కులు అధ్వానంగా మారాయి. ప్రత్యేకించి బిర్లాగేట్ సమీపంలోని ఉన్న పార్కు నిరుపయోగంగా మారింది. గేటు మరమ్మతులకు గురవ్వడంతో గోడకు ఆనించారు. పార్కు వినియోగంలో లేకపోవడంతో లోపల మొత్తం పిచ్చి మొక్కలు పెరిగాయి. గేట్లు లేకపోవడంతో పందులు సంచరిస్తున్నాయి. పార్కులోని సిమెంట్ దిమ్మెలు దగ్గర చెత్త చెదారం, మందు సీసాలు దిబ్బలను తలపిస్తున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారాయి. సమీప కాలనీలో ప్రజలు చీకటి పడగానే భయం భయంగా గడపాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి పార్కులను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



పార్కులో చెత్తచెదారం పడేసిన దృశ్యం